పులివెందులలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జగన్



ముగిసిన జగన్ పర్యటన

- రోడ్డుమార్గాన బెంగళూరుకు

పులివెందుల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగురోజుల పర్యటన ముగిసింది. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఆయన రోడ్డు మార్గాన బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. పులివెందులలో నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనేందుకు జగన్ 24వ తేదీ మంగళవారం బెంగళూరు నుంచి ఇడుపులపాయకు హెలికాప్టర్‌లో వచ్చారు. రాత్రి పులివెందులలో బస చేశారు. అనంతరం 25వ తేదీ బుధవారం పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు జరిపి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అదేరోజు లింగాల మండలంలో పర్యటించారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇక చివరి రోజైన శుక్రవారం ఉదయం ఓ వివాహ వేడుకలో పాల్గొన్నారు. సతీమణి భారతితో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పులివెందుల నుంచి హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు వెళ్లాలనేది షెడ్యూల్. అయితే వర్షం పడుతుండడం, వాతావరణం అనుకూలించకపోవడంతో దాదాపు గంటన్నరపాటు ఎదురుచూశారు. ఎంతకు వాతావరణం అనుకూలించకపోవడంతో రోడ్డుమార్గాన బెంగళూరుకు వెళ్లారు. దీంతో జగన్ నాలుగు రోజుల పర్యటన ముగిసింది.

రౌండప్ 2024

జలకళ

వీఎన్‌పల్లె నుంచి పాపాఘ్ని నీళ్లు కాలువలో వెళుతున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)



చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే వర్షాలు రావని జగన్ అండ్ కో తరచూ దుష్ప్రచారం చేస్తుంటుంది. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి చంద్రబాబుపై విపరీతమైన ద్వేషంతో దీనిని ఫోకస్ చేసేవారు. వైసీపీ నేతలు చెప్పినట్లు జగన్ అధికారంలో ఉంటే ప్రతి ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు విరగపండాలి. కానీ ఆయన అధికారంలో ఉన్న ఐదేళ్లూ అంత సీన్ లేదు. ఈ సంవత్సరం అంటే జనవరి నుంచి ఈ రోజు వరకు పరిగణనలోకి తీసుకుంటే.. జగన్ హయాంలో ఈ ఏడాది తొలిసగం వర్షాలే పడలేదు. అరక సాగలేదు. సాగు చేయలేదు. చాలా ప్రాజెక్టుల్లో చుక్కనీరు కూడా లేదు. చంద్రబాబు సీఎం అయ్యాక ఈ ఏడాది మలిసగంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. జలాశయాలు, పంటపొలాలు కళకళలాడుతున్నాయి.

- నిండిన జలాశయాలు
- పచ్చని పైర్లతో పంటపొలాలు
- తొలిసారిగా గండికోట నుంచి పాపాఘ్నికి..
- పాపాఘ్ని ద్వారా చెరువులకు నీరు
- 2.84 లక్షల ఎకరాలకు సాగునీరు
- రైతుల మోముల్లో చిరునవ్వు
- తొలిసగం వెలవెల.. మలిసగం కళకళ
- 2024 వెలుగు నీడలు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు దాటింది. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు పక్కన బెడితే అందుబాటులో నీటిని చిన్న బడ్జెట్‌తో ఎలా ఉపయోగించుకోవాలో చంద్రబాబు సర్కారు క్లియర్‌గా చెప్పింది. జిల్లాలో ప్రధానంగా తెలుగుగంగ, గండికోట, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లు ఉన్నాయి. మొత్తం సాగు భూమి 8.20లక్షల ఎకరాలు ఉంది. ఇందులో ప్రాజెక్టుల పరిధిలో సుమారు 3.50 లక్షలు ఉంటుంది. అయితే ప్రధాన ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం వల్ల ఇప్పటికీ చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది.

తాత్కాలిక పనుల కోసం రూ.3.26 కోట్లు

కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చింది. అప్పటికే జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. వెంటనే ప్రాజెక్టులు, కాల్వల గేట్లు, ఇతర మెయింటెనెన్స్‌ల కోసం రూ.3.26 కోట్లు కేటాయించారు. ఇందులో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల కోసం రూ.1.75 కోట్లు కేటాయించారు. ఎస్ఈ వెంకట్రావమయ్య బ్రహ్మంసాగర్ గేట్లను వారే పనులు, మరమ్మతులు, ఎస్ఆర్-1, ఎస్ఆర్- 2లో పూడి కతీత, ఇతర పనులు చేపట్టారు. మైలవరం డ్యాంకు రూ.1.20 కోట్లు, గండికోట ప్రాజెక్టుకు రూ.36 లక్షలు కేటాయించి నిర్వహణ పనులు చేపట్టారు. వైసీపీ హయాంలో అసలు సాగునీటి వనరులను పట్టించుకోలేదు. అధికారంలో ఉన్న చివరి ఆరు నెలలు కేవలం ఓట్ల జపంలోనే ఉన్నారు.



తెలుగుగంగ షట్టర్లను పరిశీలిస్తున్న ఈసీ వెంకట్రామయ్య (ఫైల్‌ఫొటో)

తొలిసారి సాగునీరు

జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు ఉపయోగించుకోవడమే సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశ్యం. అందుకు తగ్గట్లుగానే నీటిని తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణ తన అనుభవాన్ని ఉపయోగించి సద్వినియోగం అయ్యేలా చేస్తున్నారు. తెలుగుగంగ జలాశయం పరిధిలోని ఎస్ఆర్-1 ద్వారా మైదుకూరు నియోజకవర్గంలో 22 చెరువులు, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ద్వారా బద్వేలులో 120 చెరువులకు నీరిస్తున్నారు. ఇప్పటికే ఇందులో 90 శాతం పూర్తయింది. ఇక కలసపాడు మండలంలోని ఎగువరామాపురం సమీపంలోని తణుకువాగు ఎత్తిపోతల పథకం ద్వారా ఐదు చెరువులు, ఉప్పలూరు ద్వారా పది చెరువులకు నీరందించారు. ఇక గండికోట మెయిన్‌కాల్వ నుంచి వీఎన్‌పల్లె మండల పరిధిలోని 38వ కిలోమీటరు వద్ద కోత పెట్టి అక్కడి నుంచి పాపాఘ్ని ద్వారా కమలాపురం, చదిపిరాళ్ల, గోటూరు, తప్పెట్ల, పాపాఘ్ని పరిధిలో 20కి పైగా చెరువులను తొలిసారిగా నీటితో నింపారు. ఇక్కడ దాదాపు 15వేల ఎకరాలకు సరిపడా సాగునీరు ఉంది.

పంటలు కళకళ

జిల్లాలో దాదాపు 8.20 లక్షల ఎకరాల భూములున్నాయి. ఇందులో సాగుభూమి నాలుగు లక్షల ఎకరాల పైచిలుకు ఉంటుంది. ప్రాజెక్టుల పరిధిలో సుమారు 3.50లక్షల ఎకరాలు ఉన్నాయి. పేరుకే ప్రాజెక్టులు కానీ అవి పూర్తికాక పోవడంతో నీళ్లు అందని పరిస్థితి. అయితే కూటమి వచ్చిన తరువాత ఉన్న నీటిని ఉపయోగించుకుని చివరి ఆయకట్టుకు నీరందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. నేరుగా కాల్వల ద్వారా లేదా చెరువులకు తరలించి పంటల సాగుకు అందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 2.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది.

ప్రాజెక్టుల పరిధిలో సాగు (ఎకరాలలో..)

ప్రాజెక్టులు	సాగు
తెలుగుగంగ	80,000
కేసీ కెనాల్	89,000
పీబీసీ	50,000
మైలవరం	30,000
మైనర్ ఇరిగేషన్	25,000
మీడియం	11,000
మొత్తం	2.85 లక్షల ఎకరాలు

ఇదే జగన్ హయాంలో 1.25 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరందింది.



ఎస్ఆర్ నుంచి చెరువులకు నీళ్లు వదులుతూ గంగకు పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్‌ఫొటో)

ఇక సాగు పరిస్థితి చూస్తే...

గత ఏడాది రబీలో 62,293 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి ఇప్పటికే లక్షా 2వేల ఎకరాల్లో సాగైంది. జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. కూటమి వచ్చిన తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 210 సాగునీటి సంఘాలలో రెండుమూడు వాటిని మాత్రమే వైసీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు. మిగిలినవన్నీ కూటమి మద్దతుదారులే గెలుచుకున్నారు. సాగునీటి సంఘాల అభివృద్ధికి వరల్డ్ బ్యాంకు, జపాన్ నిధులు ఇస్తుంటుంది. ఈసారి సాగునీటి సంఘాలు ఉండడంతో వీటిని అభివృద్ధి చేసేందుకు అవకాశం వచ్చింది.

విద్యుత్‌చార్జీల పెంపుపై వైసీపీ ఆందోళన



పులివెందులలో ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ర్యాలీ

(కడప-ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో వైసీపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. కడపలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. బద్వేలులో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మైదుకూరులో రఘురామిరెడ్డి, కమలాపురంలో ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పులివెందులలో ఎంపీ వైఎస్ అనాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాల పాటు విద్యుత్‌చార్జీలు పెంచబోమని అబద్ధాలతో ప్రజలను నమ్మించిందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే పేద ప్రజలపై అధిక భారాన్ని మోపే విధంగా కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచిందన్నారు. దీంతో పేద ప్రజలపై లక్షల కోట్ల రూపాయలు భారం పడుతుందన్నారు. పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేసి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన అన్నారు.

ఐదేళ్లలో పదిసార్లు పెంచింది వైసీపీనే

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల హయాంలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ఇప్పుడు ఆ పెంపుపై వారే ఊరేగింపులు, ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. పులివెందుల పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై జగన్ లక్షా 30వేల కోట్ల రూపాయల భారం మోపారన్నారు. ఆనాడు ఇష్టానుసారంగా విద్యుత్‌చార్జీలను పెంచిన వ్యక్తి ఈ రోజు విద్యుత్‌చార్జీలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం అమలవుతున్నది కూడా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయమే అన్నారు. రాబోవు రెండు మూడేళ్లలో తక్కువ ధరకే ప్రజలకు విద్యుత్ సరఫరా చేసే రాష్ట్రంగా మన రాష్ట్రం నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం కానీ చంద్రబాబు ప్రభుత్వం కానీ ఒక్కరూపాయి విద్యుత్ చార్జీ పెంచలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తప్పకుండా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా సరే 200 యూనిట్లకంటే తక్కువ వినియోగించిన ఎస్సీ ఇళ్లకు చార్జీలు వసూలు చేసినట్లు ఒక్క ఇంటిని చూపించినా బహిరంగ క్షమాపణలు చెబుతామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, మైసూరారెడ్డి పాల్గొన్నారు.

2న అజ్మీర్ ఉర్సుకు ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అజ్మీర్ ఉర్సుకు వెళ్లే ప్రయాణికులకోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలు నడుపుతోందని కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2వ తేదీన తిరుపతిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి కడపకు 9.13 గంటలకు చేరుకుంటుందన్నారు. ఎర్రగుంట్లకు ఉదయం 9.58 గంటలకు, తాడిపత్రికి 11.03 గంటలకు అదేరోజు రాత్రి గుంతకల్ మీదుగా ఉదయం 9 గంటలకు కాచిగూడకు చేరుకుంటుం దన్నారు. 4వ తేదీ తెల్లవారుజామున 4.35 గంటలకు అజ్మీర్‌కు, 5.15 గంటలకు మదర్ జంక్షన్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో 07120 నెంబరు గల రైలు జనవరి 9వ తేదీన గురువారం తెల్లవారుజామున 4 గంటలకు మదర్ జంక్షన్‌లో ప్రారంభమై అజ్మీర్‌కు 4.15 గంటలకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 9-40 గంటలకు కాచిగూడ అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు కడప చేరుకుంటుందని తెలిపారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

- డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మరియు సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ కేర్ సెంటర్ వైద్యులు సిబ్బంది సమయపాలన పాటించాలని అకడమిక్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేశారు. తన పర్యటనకంటే గంట ముందే ఆసుపత్రికి వచ్చి సిబ్బందికి ఎవ్వరికీ చెప్పకుండా కలియతిరిగారు. క్యాజువాలిటీ మొదలు కొన్ని వార్డుల్లో వైద్య సిబ్బంది సమయానికి లేకపోవడాన్ని గమనించారు వైద్యులు సమయానికి రాకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్, సర్జరీకి సంబంధించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ వైద్య కళాశాల హెచ్‌వోడీలు, ఆసుపత్రి అధికారులతో సమావేశం నిర్వహించారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని అన్నారు.



రిమ్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న అకడమిక్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు

సొంత భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో నిర్వహించేలా స్థలాలు గుర్తించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం లెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్థితి గతులపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఈ శాఖ ద్వారా అందించే సేవలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. వీలైనంత త్వరగా సొంత భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు ఉండేందుకు వీలుగా స్థలాలు గుర్తించాలన్నారు. తల్లుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వాటి పరిణామాల గూర్చి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ట్రావెల్ ఏజెంట్ల పాత్ర కీలకం

- ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం గల్ఫ్, ఇతర దేశాలకు పంపడంలో ట్రావెల్ ఏజెంట్ల పాత్ర కీలకమని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా వారి బాగోగులు తెలుసుకుంటూ ఉండాలని ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో విదేశీ వ్యవహారాల శాఖ, ప్రొటెక్టర్ ఆఫ్ ఇమ్మిగ్రెంట్స్, హైదరాబాదు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రిజిస్టర్డ్ ట్రావెల్ ఏజెంట్లు, అన్‌రిజిస్టర్డ్ ట్రావెల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఎస్పీ మాట్లాడుతూ ఉపాధి పేరిట పలువురిని అక్రమ పద్ధతుల్లో విదేశాలకు పంపడం చట్టరీత్యా నేరమన్నారు. మహిళలు, పురుషులు సరైన వీసా, డాక్యుమెంట్లతో వెళ్లాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే సంప్రదించాలని సూచించారు. నూతన భారతీయ చట్టాల మేరకు మానవ అక్రమ రవాణాకు పాల్పడితే బీఎన్ఎస్143 యాక్ట్ కింద నేరం రుజువైతే ఏడు సంవత్సరాల నుంచి జీవితకాలం శిక్షకు అర్హులవుతారని హెచ్చరించారు. ఏజెంట్లు ప్రభుత్వ లైసెన్సు పొందాలన్నారు. గల్ఫ్ వెళ్లేవారు ఏదైనా సమాచారం కావాలన్నా ఇబ్బందులు ఎదురైనా 1800113090 లేదా 011-26885021 నెంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు రెడ్డెప్ప, పోలీసు అధికారులు, స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కడపకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

వైసీపీ నేతల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శనివారం కడపకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఎంపీడీవోపై వైసీపీ నేతల దాడి

- ఎంపీడీవో గొంతుపై కాలేసి.. పిడిగుద్దులతో హత్యాయత్నం
- గది తాళాలు ఇవ్వలేదని వైసీపీ మాజీ ఎంపీపీ దాడి
- హత్య చేయాలని చూశారంటూ బాధితుడి ఫిర్యాదు
- మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలింపు
- నేడు కడపకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్
- రిమ్స్‌లో ఎంపీడీవోను పరామర్శించనున్న పవన్
- ఎంపీడీవోకు మంత్రి, కలెక్టర్ ఫోన్లో పరామర్శ

రాయచోటి/గాలివీడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా వైసీపీ నాయకులకు దళితుల పైన కోపం పోయినట్లు లేదు. చిన్న అవకాశం దొరికినా.. వాళ్ల మీద తమ ప్రతాపం చూపుతూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో దళితులపై దాడులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అదే ఒరవడిని కొనసాగిస్తూ సాక్షాత్తు మండల పరిషత్ అభివృద్ధి అధికారిపైనే దాడి చేశారు. దౌర్జన్యంగా ఆయన ఛాంబర్‌లోకి ప్రవేశించి కింద పడేసి గొంతు మీద కాలేసి తొక్కి... పిడి గుద్దులు గుద్దారు. మేము అడిగితే గది తాళాలు ఇవ్వవా.. అంటూ కులం పేరుతో దుర్భాషలాడారు. మేము అధికారంలో లేకపోయినా మేము చెప్పినట్లు వినకపోతే ఏ అధికారికైనా ఇదే గతి.. అనే రీతిలో చెలరేగిపోయారు. గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా దళితుడైన జవహర్ బాబు పనిచేస్తున్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విధుల్లో ఉన్నారు. మధ్యాహ్నం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు, గాలివీడు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ కార్యాలయానికి వస్తున్నాడని, అతడి అనుచరులు గది తాళాలు అడిగారు. అటెండర్ వద్ద ఉన్నాయని, కాసేపటి తర్వాత ఇస్తానని ఎంపీడీవో చెప్పారు. ఇంతలో సుదర్శన్‌రెడ్డి అక్కడికి వచ్చారు. దీంతో అతడి అనుచరులు మళ్లీ గది తాళాలు అడిగారు. వైసీపీ నాయకులకు ఇవ్వనని, ఎంపీపీ అయిన సుదర్శన్‌రెడ్డి తల్లి వస్తేనే ఇస్తానని ఎంపీడీవో వారికి చెప్పారు. ఈ విషయాన్ని అతడికి అనుచరులు చెప్పడంతో ఆగ్రహించిన సుదర్శన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎంపీడీవో గదిలోకి వచ్చి గది తలుపులు మూసేసి దాడికి పాల్పడ్డాడు. కుర్చీలో ఉన్న జవహర్‌బాబును కింద పడేసి గొంతు మీద కాలేసి తొక్కారు. గుండెలపైన పిడిగుద్దులు గుద్దారు. గది బయట ఉన్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కొందరు టీడీపీ నాయకులు గది తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లారు. వారిపై కూడా వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సుమారు అరగంట పాటు వైసీపీ నాయకులు వీరంగం సృష్టించారు. సిబ్బందిని నానా బూతులు తిట్టారు. కులం పేరుతో దూషించారు. ఇప్పటికే ఎంపీడీవో గుండె సమస్యతో ఇబ్బందిపడుతూ స్టంట్ వేసుకుని ఉన్నాడు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు దాడి చేయడంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అతడిని పరీక్షించి ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం 108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన గురించి తెలుసుకున్న వైసీపీ, టీడీపీ వర్గీయులు పెద్ద సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పరస్పరం దాడులకు దిగుతారనే ఉద్రిక్త పరిస్థితుల్లో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, గాలివీడు ఎస్ఐ రామకృష్ణ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అక్కడ గుమికూడిన వారిని చెదరగొట్టారు. సుదర్శన్‌రెడ్డితో పాటు మరికొందరిని సీఐ అదుపులోకి తీసుకుని తన వాహనంలో తీసుకెళ్లారు. దీంతో గొడవ సద్దుమణిగింది. గొడవ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవోతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

14 మందిపై హత్యాయత్నం కేసు

ఈ సంఘటనలో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు పోలీసులు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో 13 మందిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ఇంకా కొందరు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం, గదిలోకి ప్రవేశించి దాడికి పాల్పడడం, హత్య చేసేందుకు యత్నించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేశారు.

పలువురి పరామర్శ

వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన ఎంపీడీవో జవహర్‌బాబును పలువురు పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి కూడా ఈ దాడిని ఖండించి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. కలెక్టర్ శ్రీధర్ ఫోన్లో జవహర్‌బాబును పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని దాదాపు అందరు ఎంపీడీవోలు ఆసుపత్రి వద్దకు వచ్చి పరామర్శించారు.

టీడీపీ కార్యకర్తలపైనా దాడి

ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేస్తున్న విషయాన్ని గమనించిన అక్కడే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టీడీపీ నాయకులు శ్రీకాంత్, నాయుడు, అంజి కార్యాలయంలోకి వెళ్లి అడ్డుకున్నారు. వారిపై కూడా వైసీపీ నాయకులు దాడి చేసినట్లు వారు తెలిపారు. తాము, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది అడ్డుకోకపోయి ఉంటే ఎంపీడీవోను హత్య చేసేవారని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో టీడీపీ నాయకులపై ఎన్నోసార్లు దాడులు చేశారని, ప్రస్తుతం కూడా వారి సంస్కృతి ఇలాగే కొనసాగుతున్నదని తెలిపారు. వైసీపీ శ్రేణులను వెంటబెట్టుకుని అరుస్తూ దాడులు చేశారన్నారు. ఎంపీడీవోపైన, తమపైన దాడి చేసిన వారిని పట్టుకుని కఠినశిక్ష పడేలా చూడాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



టీడీపీ శ్రేణులపై దాడికి ప్రయత్నిస్తున్న వైసీపీ శ్రేణులు

దాడికి పాల్పడడం దారుణం : సీఈవో

కడప రూరల్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నేతలు భౌతిక దాడికి పాల్పడడం దారుణమని జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అన్నారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం చికిత్స పొందుతున్న బాధితుడిని ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీడీవో మాటలు వింటుంటే దాడి ఏస్థాయిలో జరిగిందో అర్థం అవుతుందన్నారు. విధినిర్వహణలో ఉన్న అధికారిపై దాడులకు పాల్పడడం తగదన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబుకు జిల్లా ప్రజాపరిషత్ శాఖ అండగా ఉంటుందన్నారు. కాగా.. ఎంపీడీవో మీద దాడిచేసిన వైసీపీ నాయకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఫుడ్ టెక్నాలజీలో..
నూతన ఒరవడి

- రూ.20లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్
- ఆధునిక యంత్రాలతో విద్యార్థులకు బోధన, వ్యాపారం
- ప్రజలూ వినియోగించుకునేందుకు అవకాశం



కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు

పులివెందుల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో అటు ప్రజలు, ఇటు విద్యార్థుల కోసం చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైంది. ఆధునిక యంత్రాలతో కళాశాల యాజమాన్యం దీనిని అందరికీ అందుబాటులోకి తెచ్చింది. చిరుధాన్యాలు (మిల్లెట్స్) శుద్ధి చేయడం, వారికి కావాల్సిన విధంగా పిండి, రవ్వ రూపంలో తయారుచేయడం దీని ప్రత్యేకత. ఒకేచోట ఆరు యంత్రాలతో మిల్లెట్ ప్రాసెసింగ్ చేయడం జిల్లాలోనే మొట్టమొదటి యూనిట్‌గా చెప్పవచ్చు.

గతంలో చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేయాలంటే చాలా శ్రమతో కూడిన పని. ఇళ్లలో అమ్మమ్మ, నాయనమ్మ చిరుధాన్యాలను రోట్లో వేసి దంచి వాటిని చాటల సాయంతో శుద్ధి చేసేవారు. అనంతరం వాటిని విసుర్రాయి సాయంతో పిండిగాని, రవ్వగాని తయారుచేసేవారు. చిరుధాన్యాల ప్రాసెస్ పెద్ద శ్రమతో కూడుకున్న పని కావడం, ప్రజలు బియ్యానికి అలవాటు పడ్డంతో వీటి వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఇప్పుడంతా రెడీ ఫర్ కుక్ (వంటచేసుకునేందుకు సిద్ధం) అన్నట్టుగా బియ్యం పిండి, గోధుమపిండి, జొన్నపిండి, రాగిపిండి తదితర వాటిని వినియోగిస్తున్నారు. రానురాను మన పూర్వీకుల ఆహారపు అలవాట్లు మంచిగా ఉండేవని, మళ్లీ అటువైపే ప్రజలు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది చిరుధాన్యాల వాడకం వైపు వస్తున్నారు. అయినా చిరుధాన్యాల ప్రాసెస్ ఇప్పటి మహిళలకు పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పులివెందులలో ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో నూతన ఒరవడికి నాంది పలికారు. ఇక్కడ ఆధునిక యంత్రాలతో చిరుధాన్యాల ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.



రాగులను శుద్ధి చేయక ముందు..చేసిన తర్వాత



రాగులను ఎలా శుద్ధి చేయాలో విద్యార్థులకు వివరిస్తున్న డీన్, అధ్యాపకులు

అందరికీ అందుబాటులో..

మన చుట్టుపక్కల ప్రాంతాల్లో కొర్రలు, జొన్నలు, రాగులు, సద్దలు తదితర చిరుధాన్యాలను రైతులు పండిస్తున్నారు. వీటిని రైతుల వద్ద కొని పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో ఏర్పాటుచేసిన ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తే చాలు. అక్కడ కళాశాల విద్యార్థులు, సిబ్బంది మార్కెట్‌లో దొరుకుతున్న చిరుధాన్యాల కంటే శుద్ధిగా మనకు కావాల్సిన విధంగా తయారుచేసి ఇస్తారు.

ఉదాహరణకు ఒకరైతు వద్ద రాగులు పది కిలోలు కొని ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకెళ్తే అక్కడ మొదట ఒక యంత్రం ద్వారా రాగుల్లో ఉన్న చెత్తాచెదారం, రాళ్లు, మట్టి, ఇసుక తదితర వాటిని పూర్తిగా శుద్ధిచేస్తుంది. అలా శుద్ధి అయిన రాగులను మరో యంత్రంలో వేస్తే అందులో రాగులకు ఉన్న పొట్టును 90శాతం తొలగిస్తుంది. పక్కనున్న మరో యంత్రంలో రాగులను వేస్తే వీటిలో ఇతర చిరుధాన్యాలు ఏవైనా కలిసి ఉంటే వాటిని వేరుచేస్తుంది. అనంతరం పూర్తిస్థాయిలో పిండికావాలి ఉంటే మరో యంత్రంలో వేయాలి. అదే జొన్నలు గాని, గోధుమలు గాని రవ్వ చేసేందుకు మరో యంత్రం అక్కడే ఉంది. ఈ ప్రాసెసింగ్ అంతా కేవలం నిమిషాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఆంధ్రజ్యోతి అక్కడకు వెళ్లిన సమయంలో పది కిలోల తూకం చూసి ప్రాసెసింగ్ చేశారు. ప్రాసెసింగ్ చేసిన అనంతరం 450 గ్రాములు శుద్ధిరూపంలో బయటకు పోయింది. మిగిలిన 9.550 కిలోలు మళ్లీ తూకం వేసి చూపించారు. ఈ ప్రాసెసింగ్ చేయడానికి కిలోకు రూ.5 వసూలు చేస్తామని కళాశాల డీన్ మాధవ పేర్కొన్నారు.

విద్యార్థులకు బోధన, వ్యాపారం

ఒకప్పుడు చిరుధాన్యాలు బాగా ఉపయోగించినా అనంతరం వీటి వాడకం క్రమంగా తగ్గిపోయింది. ఇటీవల ప్రజలు చాలా మంది ఏదో ఒక అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో మళ్లీ మన పూర్వీకుల ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. కానీ చిరుధాన్యాల ప్రాసెసింగ్ చాలా శ్రమతో కూడుకున్నది. దీన్ని గుర్తించి పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల దాదాపు రూ.20లక్షలతో ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది.

దీని ద్వారా చిరుధాన్యాలను ప్రాసెసింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు టెక్నికల్‌గా బోధించే అవకాశం కలుగుతోంది. అలాగే ప్రాసెస్ చేయడం ద్వారా కళాశాలకూ కొంత ఆదాయం సమకూరుతోంది. అలాగే రైతుల వద్ద కొని తెచ్చిన వివిధ రకాల చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసి ప్యాకెట్ల రూపంలో వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. విద్యార్థులు చిరుధాన్యాలను ప్రాసెస్ చేయడమే కాకుండా వాటిని మార్కెటింగ్ చేయడం కూడా ఈ బోధనలో ఒక అంశం. కిలో చిరుధాన్యం ప్రాసెసింగ్ చేస్తే రూ.5 వసూలు చేస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. తమ కళాశాలలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది.

గొర్రెల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి, 8 మందికి తీవ్రగాయాలు





కందల సోమయ్య మృతదేహం, వ్యాన్‌లో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు/గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు రూరల్ సర్కిల్ పరిధి లోని గోగినేనిపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి చెందగా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు నుంచి గూడూరు సంతకు గొర్రెలను మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా గూడూరు గోగినేనిపురం సమీపంలో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ పిట్లావాండ్లపల్లెకు చెందిన కందల సోమయ్య (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన రమణయ్య, చిట్వేలి మండలంలోని చిన్నరాసపల్లెకు చెందిన కట్టా ఈశ్వరయ్య, రైల్వేకోడూరు పట్టణంలోని ధర్మాపురానికి చెందిన తుంగా భాస్కర్, చిట్వేలి మండలంలోని నాగవరానికి చెందిన దాడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఓబులవారిపల్లె మండలం దళితవాడకు చెందిన సిబ్యాల చినవెంకటయ్య, రైల్వేకోడూరు పట్టణం ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన నార్జాల రమణయ్య, రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లెకు చెందిన ఆరిబోయిన పెంచలయ్య, రైల్వేకోడూరుకు చెందిన నార్జాల సూర్యప్రకాష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో మినీ వ్యాన్ దెబ్బతింది. వ్యాన్‌లో కొందరు ఇరుక్కుపోవడంతో పోలీసులు, స్థానికులు కలసి సహాయక చర్యలు చేపట్టి వెలికితీశారు. మృతిచెందిన వ్యక్తి, ప్రయాణించే వ్యక్తులు అందరూ గొర్రెల వ్యాపారులని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వ్యాన్ టాప్‌లో ఉన్నాడని, లారీ ఢీకొట్టడంతో ఒక్కసారిగా సోమయ్య కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొర్రెలను ఇతర వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు మనోజ్‌కుమార్ తెలిపారు.

సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి



రాయచోటి ఏరియా ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన గాలివీడు మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని జిల్లా ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, పౌరహక్కుల నాయకుడు వంగిమళ్ల రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీవో నాయకులు, కార్మిక సంఘాల నాయకులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి తల్లి ఎంపీపీ అయినప్పటికీ.. ఆయన ఆఫీసులో పెత్తనం చెలాయిస్తూ తాను చెప్పినట్లు అధికారులు వినాలనడం సరికాదని ఆరోపించారు. సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ సభాభవనంలో ఉండేందుకు ఏ విధమైన అర్హత లేదని, అలాంటి వ్యక్తి దాడి చేయడం అన్యాయమన్నారు. ఈయనకు న్యాయవాది లక్షణాలు ఏమీ లేవని, రౌడీలాగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులకు సమాజంలో ఉండే అర్హత లేదని, శాశ్వతంగా జైల్లో ఉండాలని వారు డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులో బాహాబాహి



ఇరువర్గాల వారు ఘర్షణ పడుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు వర్గాలకు చెందిన టీడీపీ నాయకులు బాహాబాహికి దిగారు. వివరాలిలా.. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముందుగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇతర మండలాలకు చెందిన వ్యక్తులతో సమావేశానికి హాజరయ్యారు. అదే సమయానికి సీనియర్ టీడీపీ నాయకుడు, కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న తమకు కాకుండా ఇతర మండలాలకు చెందిన వ్యక్తులను ఎలా వేదికపై కూర్చొబెడతారని తహసీల్దారును నిలదీశారు. స్థానికంగా ఉన్న వారికి సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఒంటిమిట్టకు చెందిన టీడీపీ నాయకులు సమావేశానికి హాజరుకాగానే సమావేశం నుంచి సుగవాసి సుబ్రమణ్యం తన వర్గీయులతో వెనుదిరిగారు. అనంతరం మాజీ మండలాధ్యక్షుడు పామూరు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇది రాజకీయ సమావేశమా? ప్రజల కోసం ఏర్పాటు చేసిన సమావేశమా? అని ప్రశ్నించడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒంటిమిట్టలో ఉన్న స్థానిక టీడీపీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా వేదిక మీద లేకుండా ఇతర మండలాలకు సంబంధించిన వ్యక్తులను, ఇతర పంచాయతీ వ్యక్తులను కూర్చొబెట్టడంలో ఆంతర్యమేమిటని తహసీల్దారును గట్టిగా నిలదీయడంతో అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లింది. ఇదిలా ఉండగా అక్కడే ఉన్న స్థానిక సీపీఎం నాయకుడు యానాదయ్య తహసీల్దారుకు మద్దతు పలకడంతో మరింత వివాదం చోటు చేసుకుంది. తమ పార్టీకి సంబంధించిన విషయంలో సీపీఎం పార్టీకి సంబంధించిన వ్యక్తికి ఏం పని అని టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో ఇరువర్గాల వారు స్టేజీ వద్ద అరుపులు, కేకలతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్దిజెప్పి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వారి సలహాల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పడంతో సదస్సును నిర్వహించారు.

కాల్పుల ఘటనలో నిందితుడు అరెస్ట్

- నాటు తుపాకీ మందుగుండు సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్



వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట, మాధవరం గ్రామాలకు సరిహద్దు ప్రాంతంలో గల దేవరగుట్ట సమీపంలో ఈనెల 22వ తేదీ జరిగిన నాటుతుపాకీ కాల్పుల ఘటనలో నిందితుడు ముడి రమణప్పనాయుడును శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం గురికానివాండ్లపల్లెకు చెందిన ముడి నాగప్పనాయుడు కుమారుడు రమణప్పనాయుడు తన తండ్రి కాలం నుంచి 40 సంవత్సరాలుగా ఒక నాటు తుపాకీని ఉపయోగిస్తూ అడవి జంతువులను వేలాడుతూ ఉండేవారన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 21వ తేదీ శనివారం రాత్రి తన ఇంట్లో ఉన్న నాటు తుపాకీని తీసుకొని కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు గల దేవరగుట్ట సమీపానికి పోయి అడవి పందుల కోసం మాటు వేసి ఉన్నాడు. సంబేపల్లె మండల కేంద్రంలోని నామాలగుట్టకు చెందిన పూసల కులానికి చెందిన నీలకంఠం హనుమంతు, అతడి బంధువు రమణ కూడా అదేరోజు సాయంత్రం అడవి జంతువుల కోసం దేవరగుట్ట ప్రాంతంలో వలలు వేసి ఇళ్లకు వచ్చారు.

తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హనుమంతు, రమణ వలలు వేసిన ప్రాంతానికి పోయి అక్కడ వలలో ఏవైనా అడివి జంతువులు పడ్డాయా అని వెతకుతుండగా అక్కడే పందుల కోసం ముందుగానే నాటుతుపాకీతో మాటు వేసి ఉన్న రమణప్పనాయుడు, హనుమతు, రమణల అలికిడి విని అడవి పందులు అనుకుని తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చాడు. దీంతో తుపాకీ గుండ్లు వెళ్లి హనుమంతు, రమణలకు తగలడంతో వారు గట్టిగా అరిచి వలలను అక్కడే వదిలి రక్తగాయాలతో తమ ఇళ్ల వద్దకు వెళ్లగా వారి బంధువులు గాయాలతో ఉన్న వారిని చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వారిద్దరినీ కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందగా రమణ కోలుకుంటున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిందితుడు ముడి రమణప్పనాయుడు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి నాటు తుపాకీ దానిలో వాడే మూడు రకాల గుండ్లు, నల్ల మందును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కాల్పుల ఘటన కేసులో వేగవంతంగా క్లూస్ కనిపెట్టడంతో పాటు ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్‌నాయక్‌తో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

అప్పనంగా లక్షలు అప్పజెప్పారు...

- పనులు చేయకున్నా బిల్లులు
- అభివృద్ధి నిధులు పెద్దల పాలు
- ఫిర్యాదులతో గట్టు రట్టు



పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అప్పయ్యగారిపల్లె రోడ్డు

సుండుపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలన ఆ పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. అధికారమే పెట్టుబడిగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అధికారులు కూడా వైసీపీ నేతల మాటలకు తలవంచి పనులు చేయకుండానే సుండుపల్లె మండలంలో లక్షలాది రూపాయల బిల్లులు చేసినట్లు విచారణలో బట్టబయలవుతోంది. మండల అభివృద్ధి నిధుల నుంచి పంచాయతీ నిధులు రైతులకు ఉచితంగా పంపిణీ చేసే వ్యవసాయ పనిముట్లు, సంక్షేమ పథకాలకు కూడా గండికొట్టారు.

అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించిన, ప్రజాప్రతినిధుల అనుచరులు చెప్పినట్లు చెయ్యక తప్పలేదని తప్పులు చేశామని కొంతమంది అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల అభివృద్ధి నిధులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి నిధులు పక్కదారి పట్టాయని సుమారు రూ.70 లక్షల వరకు దొంగ బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు, అధికారులు పంచుకున్నారని విచారణ చేపట్టాలని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేస్తున్నారు. విచారణను సైతం ప్రస్తుతం అధికార పార్టీలో పలుకుబడి ఉన్న వ్యక్తుల సహాయంతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి.

రోడ్డు వేయకుండానే...

వైసీపీ పాలనలో అభివృద్ధికి తూట్లు పొడుస్తూ మండల అభివృద్ధికి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి వచ్చిన నిధులను అసలు పనులే చేయకుండా బిల్లులు పెట్టుకునే సంప్రదాయానికి తెరలేపారు. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలో అప్పయ్యగారిపల్లెలో సీసీ రోడ్డు వేసినట్లు రూ.1,77,975 బిల్లు చేశారని ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల ఫిర్యాదుతో జిల్లా ఉన్నతాధికారుల విచారణతో ఈ విషయం వెలుగు చూసింది. అధికారికంగా అధికారులు సంతకాలు పెట్టి ప్రభుత్వ ముద్రలతో ఎం-బుక్కులు రెడీ చేసి చెయ్యని పనికి నిధులు డ్రా చేయడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మీ అవినీతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని, కారణమైన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. 2016 టీడీపీ హయాంలో చేసిన పనులకు 2022-23 సంవత్సరం వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు డ్రా చేసినట్లు మరికొంతమంది చెబుతున్నారు.

చెయ్యమన్నారు.. చేతులెత్తేశారు....:

మా ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎంపీ మనవాళ్లే ఇబ్బంది లేదు నేను చూసుకుంటాను. బిల్లులు చేయండి.. ఇచ్చింది తీసుకోండి అని మాతో తప్పుడు పనులు చేయించారు. ప్రభుత్వం మారింది. మమ్మల్ని కాపాడండి మహాప్రభో అని కొంతమంది అధికారులు నేతలు, ప్రజాప్రతినిధుల దగ్గరికి పరుగులు తీస్తున్నారు. మాకేం సంబంధం మీ సంతకాలతో నిధులు డ్రా చేశారు. మీరే అనుభవించండి అని చెబుతున్నారని సమాచారం. లక్షలాది రూపాయలు అక్రమంగా పెట్టిన బిల్లులు తీసుకుని చేతులెత్తేశారని అధికారులు వాపోతున్నారు. తప్పు చేశాము. జీవితంలో ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయమని కొంతమంది మదనపడుతున్నారు. మండల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డిలు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలిందని స మాచారం. ఇప్పటికే విచారణలో రూ.5,03,160 లక్షలు రికవరీ చేశారు. రికవరీ డబ్బులు కూడా కొంతమంది అధికారులే చెల్లించినట్లు సమాచారం. కొంతమంది వైసీపీ నేతల మాటలు విని తప్పులు చేశాము. ఉద్యోగాలు కాపాడుకునేందుకు తప్పడం లేదని తమ జీతాల నుంచి వచ్చిన డబ్బును చెల్లించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్నగొల్లపల్లె పంచాయతీలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదులు అందాయి. విచారణ జరుగుతోంది. మరో ఐదు గ్రామ పంచాయతీల్లో పెద్ద మొత్తంలో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

విచారణ జరుగుతోంది

గత ప్రభుత్వంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని మండలానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతోంది. కొంత డబ్బును ప్రభుత్వానికి తిరిగి చెల్లించాము. విచారణ పూర్తయితే పై అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె





సుండుపల్లె మండల అభివృద్ధి కార్యాలయం - మండల నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

‘మీసేవ’కు పూర్వ వైభవం వచ్చేనా...

- వైసీపీ ప్రభుత్వంలో మీసేవ కేంద్రాలకు గ్రహణం
- సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యం
- ఆదాయం లేక నడపలేక, మూసివేయలేక అయోమయంలో నిర్వాహకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రైతులకు 1బి అడంగల్ పత్రాలు, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీసేవ కేంద్రాలకు పరుగులు తీసేవారు. ఇక నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నా.. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నా.. మీ సేవా కేంద్రాలే గుర్తుకు వచ్చేవి. అవన్నీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. సచివాలయాల వ్యవస్థను తీసుకురావడంతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో నిర్వాహకులు అటు కేంద్రాలు నడపలేక, మూయలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో మీ సేవకు పూర్వవైభవం వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.



పులివెందులలో ఓ మీసేవ కేంద్రం

పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్ర బాబు మీసేవ కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేలా వాటిని తీర్చిదిద్దారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మీసేవ కేంద్రాలు మూతబడ్డాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక ఏపీ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాలు కొట్టుమి ట్టాడుతున్నాయి. కడప జిల్లాలో అర్బన్ సెంటర్లు కడప 5, ప్రొద్దు టూరు 3, జమ్మలమడుగు 1, పులివెందుల 1, రాయచోటి 1 ఉండేవి. అంతేకాకుండా ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు జిల్లాలో మొత్తం 320 కేంద్రా లు ఉండేవి. 40 అర్బన్ ఫ్రాంచైజీలు సెంటర్లు ఉండేవి. 2011లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సీసీఎస్ భాగస్వామ్యంతో మీసేవ కేంద్రా లను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014లో చంద్ర బాబు అధికారంలోకి వచ్చాక వీటి ప్రాధాన్యత పెరిగింది. పరిమి తంగా ఉన్న సేవలను 350 వరకు పెంచారు. దీంతో మీ సేవ కేంద్రాలు కీలకంగా మారాయి. ఆపరేటర్లకు చేతినిండా పని ఉండేది. వారి జీవనం సాఫీగా జరిగేది.

సచివాలయాల రాకతో...

2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు అయ్యాక మీ సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వ సర్వీసులన్నీ సచివాలయంలోనే అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ప్రతి ఒక్కరూ సచివాలయాల బాట పట్టారు. మీసేవ కేంద్రాలకు వెళ్లేవారు కరువయ్యారు. అంతేకాకుండా జిల్లాలో ఉన్న 11 అర్బన్ సేవా కేంద్రాలు పూర్తిస్థాయిలో మూతబడ్డాయి. గతంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, వ్యవసాయ భూముల కొనుగోలులో మ్యుటేషన్ పత్రాలు మీసేవలో జారీ చేసేవారు. సచివాలయాల రాకతో అవన్నీ మాయం అయ్యాయి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు అర్బన్ ఫ్రాంచైజీలు ఆదాయం లేకపోవడంతో కొందరు మూసివేశారు. మరికొందరు మూయలేక, నడపలేక అయోమయంలో ఉన్నారు.

అన్నివేళలా అందుబాటులో మీ సేవలు

మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రివరకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, బిల్లులు చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీసేవలకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలోనే మీసేవ కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవ కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీసేవలకు ప్రజలు దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలు నడపలేక మూసి వేశారు.

సచివాలయాల్లో సేవలు ఉన్నా....

గ్రామ, వార్డు సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. ఇక రెవెన్యూ, వ్యవసాయ పౌర సరఫరాలు, విద్యుత్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ వంటి సేవలు అందిస్తామన్న ఆయాశాఖల నుంచి అధికారులు మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తులు ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు.

అంతా... గందరగోళం..

ఇక సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్ ఇన్ కమ్ ఫ్యామిలీమెంబరు సర్టిఫికెట్లకు ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలు సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని.. సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవ కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీసేవ కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంలో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గత ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో కడప జిల్లా మీసేవ ఆపరేటర్లు లోకేశ్‌ను కలిశారు. మీసేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వస్తే సచివా లయాల వ్యవస్థ రద్దు చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. అదే జరిగితే మీ సేవ కేంద్రాలు పూర్వవైభవం సంతరించుకుంటాయని నిర్వాహ కులు భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నిర్వాహకులు అప్పుడు ఇప్పుడు అంతేనంటూ పెదవి విరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్ర బాబునాయుడు మీ సేవా కేంద్రాలకు పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

రైతులకు శాశ్వత రస్తా సౌకర్యం కల్పించండి

- జువారి అధికారులకు ఆర్డీఓ ఆదేశం

ఎర్రగుంట్ల, డిసెంబరు 27: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి నుంచి ఎర్రగుడిపాడు రస్తాలో జువారి రైల్వేట్రాక్ వద్ద రైతులకు శాశ్వత రస్తా పరిష్కారం చూపాలని జమ్మలమడుగు ఆర్డీఓ తేజశ్రీ జువారి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఎర్రగుంట్ల బీజేపీ నేత కత్తి ప్రతాప్‌రెడ్డి మరికొందరు రైతులు రైల్వే ట్రాక్‌వద్ద రస్తా లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు, ఆర్డీఓకు, జువారి అధికారులకు రిజిస్టర్ పోస్టుల ద్వారా ఫిర్యాదు చేశారు. ఎర్రగుడిపాడు రస్తా పూర్వం నుంచి ఉందని, జువారి రైల్వే ట్రాక్ వేసిన తర్వాత ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, రైతులు ట్రాక్‌పైనుంచి వెళ్లాలన్నా, దాటాలన్నా తీవ్ర ఇబ్బందులున్నాయి. ఇందుకు స్పందించిన ఆర్డీఓ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి సరైన శాశ్వత రస్తా సౌకర్యం కల్పించాలని ఆర్డీఓ జువారి యాజమాన్యాన్ని ఆదేశిస్తూ లేఖ రాశారు. వారి స్పందన చూసిన తర్వాత సంబంధిత రైతులతో చర్చించి కోర్టుకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామని బీజేపీ నేత ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు లేబాక పాఠశాల విద్యార్థిని ఎంపిక


ఎంపికైన భవ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అరిగెల భవ్య అనే విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. చెన్నైలో ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ నేపధ్యంలో ఆ క్రీడాకారిణిని ఉపాధ్యాయులు అభినందించి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

హాకీ పోటీలకు పులివెందుల విద్యార్థి..




పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కూలు గేమ్స్ హాకీ అండర్ 14 పోటీలకు పులివెందుల విద్యార్థి ఎం.సంజయ్ ఎంపికయ్యాడు. పులివెందులలోని సెంటెన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు దయాసిస్టర్, స్వప్న సిస్టర్ అన్నారు. నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప జిల్లా టీంలో ఆడి అత్యధిక గోల్స్ చేసి టీం విజయానికి తోడ్పడ్డారన్నారు. సంజయ్ ఎంపిక పట్ల సెంటెన్స్ స్కూలు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కడప ఉక్కుపై పాలకులు మౌనం వీడాలి



కన్యతీర్థం ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎఫ్‌బీ

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు మౌనం వీడి కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.జయవర్ధన్, మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి హిమబిందు డిమాండ్ చేశారు. శుక్రవారం కన్యతీర్థం-సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర విభజన సందర్భంలో పార్లమెంటులో ఇచ్చిన హామీని అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చినా విభజన హామీలను మాత్రం అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా కేంద్రంపై వత్తిడి తేకపోవడం దారుణమన్నారు. ఇంతవరకు ఉక్కు ఫ్యాక్టరీపై నోరు మెదపకపోవడం సీమ ప్రాంత అభివృద్ధిని నీరుగార్చడమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సగిలిరాజేంద్ర, అరుణకుమారి, వసంత్, సుందరయ్య, లక్ష్మినారాయణ, చరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కడప బేసిన్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి : వీసీ


మాట్లాడుతున్న కావేరీ ఓఎన్‌జీసీ జనరల్ మేనేజరు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖనిజ సంపదలకు నిలయమని. ఈ జిల్లాలో విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. పెట్రోలియం జియాలజిస్ట్‌ల సంఘం వైవీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఎక్స్‌ప్లోరింగ్ క్లాసిక్ అండ్ కార్బోనేట్ రాష్ట్ర కడప బేసిన్ ఐదురోజుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉందని, దానిపై లోతైన అధ్యయనం జరగాల్సి ఉందన్నారు. కావేరి ఓఎన్‌జీసీ బేసిన్ జనరల్ మేనేజరు డాక్టర్ సి.ఆర్ముగం మాట్లాడుతూ 30 మందితో కూడిన పరిశోధన బృందం సమగ్ర పరిశీలన చేస్తామన్నారు. వర్క్‌షాపు కన్వీనర్లు ప్రొఫెసరు వంగల సునీత, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఆలిండియా క్రిష్ణగోదావరి బేసిన్ అంకాళేశ్వర ఆయిల్ ఫీల్డ్, అస్సాం ఆయిల్ ఫీల్డ్ సంస్థల నుంచి 30 మంది పరిశోధకులు ఐదురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ పర్యటన అనంతరం సర్వే నివేదిక ప్రచురించి భారత ప్రభుత్వానికి అందజేస్తారని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి వెల్లడించారు.



ముగ్గురు నిందితుల అరెస్ట్

చిట్వేలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు. గురువారం పుల్లంపేట మండలం వత్తలూరుకు చెందిన ఏరుకాళ్ల వెంకటేశ్వర్లు(32) పుల్లంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య రేవతి, ఆమె తండ్రి వెంకటయ్య, తమ్ముడు వంశీలు వేధించడంతో తమ కుమారుడు మృతి చెందాడని వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు చిట్వేలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి.. రాజంపేట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక కవి సమ్మేళనం

కడప కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర మున్సిపల్ మైదానం వద్ద గల ఐఎంఏ హాలులో వచ్చే ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జిల్లా రచయితల సంఘం రెండో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. ఇందులో రాయలసీమ భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం అనే అంశాలపై శతాధిక సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ 20 లైన్లలో కవిత కానీ, తేటగీతి, ఆటవెలది కంద పద్యాల్లో నాలుగు పద్యాలు కానీ, 2 లేక 3 వృత్త పద్యాలు కానీ 15వ తేదీలోపు జిల్లా శతాధిక కవి సమ్మేళనం అనే వాట్సప్ గ్రూపు లేక 9704651414, 9703912727 అనే నెంబర్లకు మీ కవిత కానీ పద్యాలు కానీ పంపించాలన్నారు. వాటిలో న్యాయ నిర్ణేతల ద్వారా మూడు ఉత్తమ కవితలను ఎంపిక చేసి ప్రథమ విజేతకు రూ.3వేలు, ద్వితీయ విజేతకు రూ.2వేలు, తృతీయ విజేతకు రూ.వెయ్యి బహుమతులు అందజేస్తామన్నారు. తదుపరి కవులు పంపిన ప్రతి కవితను మహాసభల్లో ఆ కవి ద్వారా ఆలాపన చేయించి పెద్దల సమక్షంలో శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామన్నారు. ఈసారి మహాసభల్లో విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేమన శతకం, సుమతి శతకం పద్యపఠన పోటీలు, జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు కవితల పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులోని విజేతలకు కూడా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందిస్తామని తెలిపారు.

గొరిగెనూరులో ఘర్షణ

- పలువురిపై కేసు నమోదు

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిగెనూరు గ్రామంలో శుక్రవారం ఇరువర్గాలు ఘర్షణపడ్డారు. గ్రామంలో గొంగటి హేమంత్‌రెడ్డి, ఉప్పలూరు ధరణీకుమార్‌రెడ్డి వారికుటుంబసభ్యులు గొడవ పడ్డారు. ఇంటి ఎదురుగా రోడ్డు మీద నీళ్ల విషయంలో ఇరువర్గాలు మాటామాట పెరిగి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో హేమంత్‌రెడ్డి, ధరణీకుమార్‌రెడ్డికి చిన్న చిన్న రక్తగాయాలయ్యాయి. వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పై ఇద్దరితోపాటు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

వేంపల్లె, డిసెంబరు 27: వేంపల్లె మండలం తాళ్లపల్లె ప్రాంతంలో కడపకు చెందిన వ్యక్తి అక్రమంగా అండర్ గ్రౌండ్ మైనింగ్ చేస్తున్నారని విజిలెన్స్ మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారు శుక్రవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ ఆర్‌ఐ రామసుబ్రమణ్యం, మైనింగ్ ఆర్‌ఐ ఆమని విజయలక్ష్మి ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లారు. రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంతో హద్దులను గుర్తించేందుకు వీల్లేదని మరో మారు తనిఖీ చేస్తామని తిరిగి వెళ్లారు. అక్రమ మైనింగ్ ఎవరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోగొట్టుకున్న బంగారు నగల బ్యాగు అప్పగింత


బంగారు నగల బ్యాగును ప్రయాణికురాలికి అందిస్తున్న ఆర్టీసీ కంట్రోలర్, కండెక్టర్లు

పోరుమామిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ప్రయాణిస్తున్న ఓ బస్సు ఎక్కాల్సిన మహిళ మరో బస్సు ఎక్కింది. ఈ ఆతృతలో బంగారు నగలున్న బ్యాగును బస్సులో మరిచి పోయింది. ఆ వెంటనే గుర్తించి బస్టాండులో ఉన్న కంట్రోలర్‌కు తెలిపింది. దీంతో ఆయన ఆ బస్సు కండక్టరు నుంచి బ్యాగు తెప్పించి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకెళితే... మైదుకూరు నుంచి గిద్దలూరుకు ఓ మహిళా ప్రయాణికురాలు ప్రయాణిస్తోంది. బస్సు పోరుమామిళ్ల బస్టాండుకు చేరుకోగానే ఆమె తన అవసర నిమిత్తం బస్సు దిగింది. తిరిగి ఆమె తొందరలో ఆ బస్సు కాకుండా మైదుకూరు వెళుతున్న బస్సు ఎక్కింది. ఆ వెంటనే గమనించి కిందికి దిగింది. అప్పటికే ఆమె వెళ్లాల్సిన గిద్దలూరు బస్సు వెళ్లి పోయింది. ఆమె ప్రయాణించే బస్సులో తన బంగారు ఆభరణాలున్న బ్యాగు, రెండు వేల నగదు, సెల్‌ఫోన్‌ను మరిచిపోయినట్లు గుర్తించింది. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో ఆమె కంట్రోలర్ నాగరాజును ఆశ్రయించింది. దీంతో ఆయన బస్సు కండక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి బ్యాగును తెప్పించారు. హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న 20 గ్రాములు బంగారు ఆభరణాలు, సెల్‌ఫోను, రూ.2వేలు నగదును మైదుకూరు డిపో కండక్టరు మాధవి, గిద్దలూరు డిపో కండక్టరు జయరంగరావు తో కలసి ఆమెకు అందించారు.

పక్కా గృహాల సముదాయం పరిశీలన

రామాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలో పూర్తయిన పక్కా గృహాల సముదాయాలను శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. జనవరి 3వ తేదీ సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా పక్కా గృహాల నిర్మాణాలను సందర్శించనున్నారని తెలిపారు. కాలనీలో రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, కరెంటు సక్రమంగా ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ సాంబశివరావు, డీఈ సుబ్బరాయుడు, ఏఈ ఏఎన్ఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ, ఐబీపీఎస్, ఆర్‌బీఐలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. శుక్రవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ జనవరి 1 నుంచి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9705333305లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవిబాబు, జేవీవీ నాయకులు రాకేష్, పవన్, హర్షిత, చంద్రకళ, అఫ్రోజ్, హరినాథ్, రాజేశ్వరి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో అయ్యప్పభక్తుల బస్సుకు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు


నిలబడిన లారీని ఢీకొన్న అయ్యప్పస్వాముల బస్సు

దువ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి చెందిన అయ్యప్పస్వాములతో వెళ్లిన బస్సు ప్రమాదానికి గురైంది. ఆలస్యంగా అందించిన సమాచారం మేరకు ఈనెల 24వ తేదీ 38 మంది అయ్యప్ప భక్తులుదువ్వూరు నుంచి శబరిమలకు బస్సులో బయల్దేరి వెళ్లారు. అయ్యప్ప దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడులోని రామేశ్వరంలో దేవుని దర్శించుకుని చాలా దూరం ప్రయాణించారు. 25 తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో నిలబడి ఉన్న లారీని బస్సు వేగంగా వెళ్లి ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలైయినట్లు బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. బస్సు చాలా మేరకు ధ్వంసం అయినట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేద ప్రజల ఆరోగ్యభద్రత సీఎం సహాయనిధి


చెక్కు అందిస్తున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల ఆరోగ్యం భద్రత సీఎం సహాయనిధి అని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసం నందు పులివెందుల నియోజకవర్గానికి చెందిన సీఎం సహాయనిధి చెక్కులను పది మంది బాధితులకు సుమారు రూ.24,15,531 అందించారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబుకు, శాసనమండలి సభ్యుడు రాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

30 నుంచి కానిస్టేబుల్ నియామకాలకు పీఈటీ, పీఎంటీ పరీక్షలు

కడప క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఉద్యోగ నియామకానికి సంబంధించి పీఈటీ, పీఎంటీ స్ర్కీనింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పలు ముఖ్యసూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో ఈ నెల 30వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు పీఎంటీ పీఈటీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు హాజరవ్వాల్సిన తేదీ, సమయానికి సంబంధించి హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. కేటాయించిన తేదీ, సమయానికి అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్ల రెండు జిరాక్స్ కాపీలు అటెస్ట్ చేసినవి తీసుకురావాలని, రిక్రూట్‌మెంటు నోటిఫికేషన్ వచ్చిన తరువాత జారీ చేయబడ్డ కుల ధృవీకరణ పత్రం, క్రిమిలేయర్ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా ఎస్పీ సూచించారు. నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ప్రైవేటుగా చదివి ఉంటే నోటిఫికేషన్ తరువాత జారీ చేయబడ్డ రెసిడెన్స్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలన్నారు.

యురేనియం ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇవ్వాలి

లింగాల, డిసెంబరు 27: యురేనియం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి వెంటనే నీరు సరఫరా చేయాలని అంబకపల్లి గ్రామస్థులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తెచ్చారు. శుక్రవారం ఆయన పులివెందుల నుంచి అంబకపల్లి-ధర్మవరం మీదుగా బెంగళూరుకు బయలుదేరారనే సమాచారం తెలియడంతో రోడ్డుపైకి చేరుకుని జగన్ కాన్వాయ్‌ని ఆపి వినతి పత్రం అందించారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న కన్యకాపరమేశ్వరి

వేంపల్లె, డిసెంబరు 27: ధనుర్మాస పూజల్లో భాగంగా వేంపల్లెలో వెలసిన కన్యకాపరమేశ్వరిని భక్తులు మాదేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తిని తులసి ఆకులతో అలంకరించి పూజలు చేశారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

పెండ్లిమర్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన మణికంఠ (27) శుక్రవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. తన ఇంట్లో విద్యుత్ సరఫరాలేక పోవడంతో ఇంటి పైకి వెళ్లి విద్యుత్ వైర్లు తగిలిస్తుండగా షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

నీరున్నా నిరుపయోగమే...


కళకళలాడుతున్న సర్వరాయసాగర్ రిజర్వాయర్.. అసంపూర్తిగా ఉన్న కుడికాల్వ

● తాగునీరు ఇవ్వలేని దుస్థితి

వీరపునాయునిపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వందలాది కోట్ల రూపాయలు వెచ్చించి జలాశయాలు నిర్మించినా కాల్వలు లేకపోవడంతో రైతులకు నీరు అందడం లేదు. గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో తొలిదశలో 35వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా 1500 ఎకరాలకు మాత్రమే ఇస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గండికోట జలాశయం నుంచి సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్లకు నీరు పుష్కలంగా ఉన్నాయి. అయితే ఆయకట్టుకు నీళ్లు అందించే ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు తవ్వకపోవడంతో నీళ్లు ఉన్నా ఉపయోగంలో లేని దుస్థితి. ఈ రెండు జలాశయాల కింద కొన్ని ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు నిర్మించేందుకు దాదాపు రూ.24 కోట్ల వ్యయతో అంచనాలు రూపొందించారు. నిధులు మంజూరు కావడంతో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా కట్టవద్ద ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు, రివిట్‌మెంట్ పనులు పూర్తి చేయించేందుకు భూమిపూజ చేపట్టారు. ఆపై ఈ విషయం మరచిపోవడంతో ఈ రిజర్వాయర్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సర్వరాయసాగర్ ఎడమకాల్వ కింద 9.6కిలోమీటర్లు ప్రధాన కాల్వలు తవ్వాలి. ఆరు కిలోమీటర్ల మేర పిల్ల కాల్వల పనులు పూర్తి చేయాలి. అలాగే కుడికాల్వ కింద 16.5కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు నిర్మించాల్సి ఉంది. 9కిలోమీటర్ల మేర పిల్ల కాల్వలు పూర్తిచేయాల్సి ఉంది. సర్వరాయసాగర్, వామికొండ జలాశయాల్లో నీళ్లు ఉన్నా కాల్వలు సరిగా లేకపోవడంతో సరఫరా చేయలేకపోతున్నారు. సర్వరాయసాగర్ జలాశయం కింద వృథాగా ఊట నీరు పోతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు పోతుండటం పట్ల సాగుచేసిన పంట పొలాల్లో ఊటనీరు వస్తుండటంతో సాగుచేసిన పంట పాడైపోతోంది. ఈ ప్రాజెక్టు వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో మిగిలి ఉన్న రివిట్‌మెంట్, పల్లకాల్వల పనులను పూర్తిచేయించి మండల వాసులు కన్న కలలు సాకారం అయ్యేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చరిత్రకారుడు మన్మోహన్‌సింగ్ : తులసిరెడ్డి



వేంపల్లె: నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి తదితరులు... వైవీయూలో నివాళులర్పిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తదితరులు


కడప: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వేంపల్లె, డిసెంబరు 27: మాజీ ప్రధాని, స్వర్గీయ మన్మోహన్‌సింగ్ చరిత్రకారుడు అని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కొనియాడారు. వేంపల్లెలో శుక్ర వారం మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మో హన్‌సింగ్ దేశ ఆర్థిక అభివృద్ధిలో విశేష కృషి చేశారన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది: అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ సేవలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మేయరు సురేశ్‌బాబు మాట్లాడుతూ పదేళ్లపాటు దేశ ప్రధానిగా గొప్పగా సేవలందించారని ప్రశంసించారు. ఆర్‌బీఐ గవర్నరుగా, ఆర్థిక మంత్రిగా ఆర్థిక సంస్కరణలతో దేశ పురోభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు.

ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరం

కమలాపురం: ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వైవీయూలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదర్శమూర్తి, దేశం గర్వించదగ్గ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వైవీయూ ఘన నివాళులర్పించింది. శుక్రవారం యోగివేమన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, అధ్యాపకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎకనామిక్స్ ప్రొఫెసరు అనిత, అకడమిక్ డీన్ ప్రొఫెసరు దాము, ఎంబీఏ హెచ్‌ఓడీ సరిత మాట్లాడారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు: విజయజ్యోతి

కడప కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళుర్పించినట్లు ఆమె పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయ ఆవరణంలో ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ నేలకు అవసరైన నీరు, పోషక పదార్థాలు అందినప్పుడే మంచి పంటలు పండి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. సన్న, చిన్న కారు రైతులు ఐదు ఎకరాల లోపు వారికి 90 శాతం సబ్సిడీతోనూ, ఐదు ఎకరాలు పైన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ రైతులకు 70శాతం సబ్సిడీతో ఈ పరికరాలను అందిస్తున్నామన్నారు. కమలాపురం నియోజకవర్గం కరువు ప్రాంతం కాబట్టి ముందుగా ఈ ప్రాంతంలో రైతులకు పరికరాలు పంపిణీ చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన అనుమతించారన్నారు. పరికరాలు అందని వారు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. వారికి కూడా 15 రోజుల్లో డ్రిప్ పరికరాలు అందే విధంగా చూస్తామన్నారు.

దోమల నివారణకు సహకరించండి

పులివెందుల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంత వ్యాధులు వ్యాప్తిచేసే దోమల నివారణకు సహకరించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించి అబేట్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ దోమల వలన డెంగ్యూ,మలేరియా, బోదకాలు, మెదడువాపు వ్యాధి లాంటిప్రాణాంతక వ్యాధులు వస్తాయన్నారు. ఎక్కువ రోజులు నీటినిల్వలు లేకుండా చూసుకోవాన్నారు. దోమ లార్వా మంచినీటిలో ఉంటుందని, వారానికి ఒకరోజు ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. ఇంటిపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

నిత్యావసర సరుకులు వితరణ

కడప(వినాయకనగర్), డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆజాద్‌నగర్ బృంద నిరాశ్రయుల వసతి గృహానికి కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రోగ్రాం అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహ కులు బాలసుబ్బయ్య, సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి, ప్రోగ్రాం అధికారులు విజయలక్ష్మి, శశిదేవి, అధ్యాపకులు గురుమోహన్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు

కడప రూరల్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి) : హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారిని తగు చర్యలు చేపట్టాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశం నిర్వహించారు.

శ్రీ గంగమ్మ దేవత దేవస్థానము

కొత్తపేట గ్రా., చింతకొమ్మదిన్నె మం., వై.యస్.ఆర్.కడప జిల్లా.

బహిరంగ వేలము ప్రకటన : వై.యస్.ఆర్.కడప జిల్లా, చింతకొమ్మదిన్నె మండలం, కొత్తపేట గ్రామంలో వెలసియున్న శ్రీ గంగమ్మ దేవత దేవస్థానము హక్కు **01-02-2025 నుండి 31-01-2026 భుక్తము** గల ఈ క్రింద తెలిపిన హక్కులను **30-12-2024వ తేదీ సోమవారం ఉదయం 11-00 గంటలకు శ్రీ గంగమ్మ దేవత ఆలయ ఆవరణము** నందు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షములో బహిరంగ వేలము జరుపబడును.

హక్కు వివరములు

క్ర.సం.	వివరములు	లీజుకు ఇచ్చు కాలము	డిపాజిట్ మొత్తం
1.	టెంకాయల విక్రయించుకొనే హక్కు	01-02-2025 నుండి 31-01-2026 వరకు	రూ.50,000/-
2.	తలనీలాలు ప్రోగుచేసుకొనే హక్కు	01-02-2025 నుండి 31-01-2026 వరకు	రూ.50,000/-

ఇతర షరతులు దేవాలయ కార్యాలయము నందు తెలుపబడును. సం/- కార్యనిర్వహణాధికారి

విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి

● ర్యాలీలో వైసీపీ నాయకులు


ర్యాలీలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కడప మేయర్ సురేశ్‌బాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పులివెందుల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెంచిన వి ద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడు నెలలకే విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. రాష్ట్రంలో రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారన్నారు. విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో పెట్టారన్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఎలక్ట్రిసిటీ డిస్కంలకు సబ్సిడీ కింద కేవలం రూ.13వేలకోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి 2024 వరకు రూ.48వేల కోట్లు డిస్కంలకు సబ్సిడీ రూపంలో చెల్లించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలకు 200 యూనిట్ల వర కు బిల్లు అవసరం లేదని వైసీపీ ప్రభుత్వం ప్రకటించగా చంద్రబాబు ప్రభుత్వంలో బిల్లుల వసూళ్లకు పరుగులు తీస్తున్నారన్నారు. అనంతరం డీఈ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రి అందజేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాదుడే బాదుడు: అంజద్ బాషా

కడప ఎర్రముక్కపల్లి డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరు తో ప్రజలపై బాదుడే బాదుడు అన్నట్లుగా వ్యవ హరిస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్ బాషా, కడప మేయర్ సురేశ్ బాబు ధ్వజ మెత్తారు. శుక్రవారం వారు కడప నగరంలో పోరుబాట నిర్వహించారు. వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ జిల్లా అధికారి రమణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మే రకు పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు యానాదయ్య, మాసీమ బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, సీనియర్ నాయకులు సుభాన్‌బాషా, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్ భారం తగ్గించాలి

కమలాపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలపై విద్యుత్ భారం తగ్గించాలని వైసీపీ కమాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి అన్నారు. శుక్రవారం కమలాపురంలో నిర్వహించిన పోరుబాట నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు పెంచిన వైసీపీనే ధర్నాలు చేయడం సిగ్గుచేటు'

చెన్నూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన నాటి వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు దొంగే దొంగ అన్నట్లుగా ధర్నాలు చేయడం సిగ్గుచేటని తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. చెన్నూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై నాటి పాలకులైన మీరు ఎలాంటి ఇబ్బందులు పెట్టారో ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఇష్టానుసారంగా చార్జీలు పెంచిన ఫలితమే ఇప్పుడు ప్రజలు ఎంతో బాధపడుతున్నారన్నారు. ఇప్పుడు ఆ భారం తగ్గించేందుకు ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దే పనిలో ఉందన్నారు. ఇంకా ఏ నిర్ణయం తీసుకోకముందే అప్పుడే గగ్గోలు పెడుతూ చార్జీలు పెంచినట్లుగా ధర్నాలు చేయడం మీలాంటి వారి నైజమన్నారు. దాదాపు రూ.36వేల కోట్ల విద్యుత్ భారాన్ని ఐదేళ్లలో ప్రజలపై వేసినప్పుడు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడతారోనన్న విషయం మీకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధికి తోడ్పడే విధంగా నడుచుకోవాలని, ఇలాంటి ధర్నాలు, రాస్తారోకోలు ఎన్నిమార్లు చేసినా ప్రజలు మీపై దయ చూపరని స్పష్టం చేశారు.

ప్రత్యక్ష పరిశీలనతో ఆచరణాత్మక జ్ఞానం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష అనుభవం ద్వారా ఆచరణాత్మక జ్ఞానం పొందడాన్ని పరిశ్రమల సందర్శన ఉపయుక్తమవుతుందని వీసీ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంబీఏ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మేనేజ్‌మెంటు నిర్వహణతో పాటు కమ్యునికేషన్ స్కిల్స్ ఉన్న వారు దేశ విదేశాల్లో రాణిస్తారన్నారు.

ఇలియాస్ ఖాన్ మృతికి డీఈఓ కారణం

● 30న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా
● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక


ఐక్యతను చాటుతున్న జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఏలో ఏఎస్ఓగా పనిచేస్తూ మరణించిన ఇలియాస్‌ఖాన్ మృతికి డీఈఓ కారణమని, ఆమె దుర్భాషలాడుతూ మానసిక క్షోభకు గురి చేసిందని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఈనెల 30న డీఈవోను మార్చవద్దంటూ డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. శుక్రవారం కడప నగరం డీసీఈబీ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు తీసుకున్న మీనాక్షి పలు పాఠశాలలను దర్శించినప్పుడు అక్కడి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ మానసిక శోభకు గురి చేశారన్నారు. ఆమె అడిగినదానికి సమాధానం చెప్పినప్పటికీ ఏదోక వంక చూపుతూ తిడుతుందని ఆరోపించారు. ఇటువంటి డీఈవో మాకు వద్దంటూ ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఈ నెల 30న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు, ఎస్టీయూ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్‌టీయూ, ఆర్‌యూపీసీ, ఆపస్, స్కూలు అసిస్టెంట్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, ఎన్‌సీసీ అసోసియేషన్, ఆర్‌జెయుపి హౌస్ బిల్డింగు సొసైటీ, ఎస్‌టీఎఫ్, ఎస్ఆర్‌పీఎఫ్, ఎస్‌టీఏ నాయకులు పాల్గొన్నారు.

పీఆర్సీని తక్షణం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే 12వ పీఆర్సీ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. యూటీ ఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి రమణ, రాష్ట కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనరు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఒంటిమిట్టను దర్శించిన యువత

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలోని ఏకశిలానగరమైన కోదండ రామాలయంను దర్శించుకోవడం చాలా సంతోషదాయకమని జిల్లా ఎస్సీ కార్పోరేషన్ సంచాలకులు బ్రహ్మయ్య తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్ జిల్లా ఎక్సేంజ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం కడపజిల్లాలోని ప్రముఖ క్షేత్రాలను దర్శించడం జరిగింది. అందులో భాగంగా రాష్ట్రానికే తలమానికమైన ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని దర్శించడం అదృష్టమన్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

పోరుమామిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంట క్వాలు, కుంటల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ అన్నారు. శుక్రవారం రంగసముద్రంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో తహసీల్దారుకు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు నుంచి రంగసముద్రం చెరువుకు నీళ్లు వెళ్లే పంట కాల్వలు బస్టాండు ప్రాంతం, వెంకటేశ్వరస్కూలు వెనుకవైపున వున్న ప్రాంతం ఆక్రమణలు తొలగించి కాల్వను రంగసముద్రం చెరువులో కలపాలన్నారు. మల్లకతవ నుంచి బెల్లగోడు కాల్వపై ఆక్రమణల్లో పూడిక తీసి రంగసముద్రం చెరువుకు నీరివ్వాలన్నారు. రంగసముద్రం పంచాయతీ చెరువు పోరంబోకు 226 సర్వేనెంబరు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గుర్రాల పాడును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

రేపు లలిత సామూహిక కోటినామ పారాయణం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సామూహిక లలితా కోటినామ పారాయణం నిర్వహిస్తున్నట్లు పారాయణ కమిటీ అధ్యక్షుడు బూతూరు వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ లోకకల్యాణార్థం వెయ్యి మంది భక్తులతో సామూహిక లలితా పారాయణం నిర్వహిస్తున్నామని, పాల్గొనే భక్తులకు అల్పాహారం, అన్నప్రసాద వినియోగం చేస్తామని తెలిపారు. శ్రీవిద్యాపీఠం మౌనస్వామి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, శివాలయం చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. సమావేశంలో స్వరాజ్య ఆశ్రమం ఉపాధ్యక్షురాలు మాతృశ్రీ రత్నమ్మ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మేకల బాలనాగిరెడ్డి



బాలనాగిరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

కొండాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా దత్తాపురం వాసి మేకల బాలనాగిరెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా, మండల బీజేపీ నేతలు, కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు ఏటూరు రమణారెడ్డి ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నారు. మండలంలో బీజేపీ అభివృద్ధికి తన శాయాశక్తుల కృషిచేస్తానని బాలనాగిరెడ్డి అన్నారు. కొండాపురం రైల్వేస్టేషన్‌లో కరోనాకు ముందు నడిచే అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇచ్చేలా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీజేపీ నేతలు జిల్లా అధ్యక్షు డికి వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ శుక్రవారం ఎంఈఓ సావిత్రమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల మధ్యలో ఆ పాఠశాల అడ్మిషన్లు చేపడుతోందని ఫిర్యాదు చేశారు. జూన్‌లో ప్రారంభం కావాల్సిన అడ్మిషన్లు ఏడు నెలల ముందుగానే చేపట్టడం దారుణమన్నారు. పట్టణంలోని అనేక ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రభుత్వంపై నమ్మకం పోతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు

దువ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు చోట్ల ప్రభుత్వ భవనాలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలకు రూ.6.15 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజనీరు శివకుమార్ తెలిపారు. తాత్కాలికంగా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల కోసం ఈ నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఐసీడీఎస్ కింద ఈ నిధుల కేటాయింపు జరిగినట్లు పేర్కొన్నారు. 25 పనులు ఈ నిధులతో చేపడతామని వివరించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

మైలవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కడపజిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని మైలవరం మండల సీపీఎం నేతలు కొండయ్య, దాసు పిలుపునిచ్చారు. మైలవరంలో మహాసభల కరపత్రాలను విడుదల చేసిన వారు మాట్లాడుతూ జనవరి 4, 5 తేదీల్లో కడప నగరంలో జరుగనున్న మహాసభల్లో 4వ తేదీ భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సంజీవ రాయుడు, దాసు, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై సాగుతున్న సర్వే

నెలరోజులుగా అమృతానగర్‌లో రెవెన్యూ బృందాల విచారణ ● వైసీపీలో సాగిన ఇళ్ల స్థలాల అక్రమ దందా
కబ్జాకు గురైన ఇంటి స్థలాలను గుర్తించేందుకు వేట ● నకిలీ పట్టాదారుల ఏరివేతకు యత్నం

ప్రొద్దుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అమృతానగర్‌ల ఇంటి స్థలాల్లో జరిగిన అక్రమాలపై రెవెన్యూ అధికారుల సర్వే కొనసాగుతూనే ఉంది. వైసీపీ నేతలు సాగించిన దందాతో దాదాపు ఒక్కో ప్లాట్‌ను రూ.2లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. లేఅవుట్‌లో సామాజిక స్థలాల్లో పోస్టాఫీసు, అంగన్‌వాడీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల కోసం వదిలిన స్థలాలపై అక్రమంగా పట్టాలు సృష్టించి స్వాధీనం చేసుకున్నారు. దాదాపు వందల ప్లాట్లు రాత్రికి రాత్రే పునాదులు నిర్మించడం అప్పట్లో పరిపాటిగా మారినా రెవెన్యూ అధికారులు ఏ చర్యలూ తీసుకోలేదు. దీంతో వందలాది ఖాళీ ప్లాట్లు, సహా సామాజిక అవసరాలకు వదిలిన స్థలాలన్నీ అక్రమణ పాలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలపై రెవెన్యూ అధికారుల అండతో వైసీపీ నేతల అనుయాయులు అక్రమంగా పొందారనే ఆరోపణలున్నాయి. లేఅవుట్‌లో ప్రధాన రోడ్డు వెంబడి వున్న ఖాళీ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు పుట్టించి పెద్ద పెద్ద భవనాలు షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి జోక్యంతో అధికారులు స్పందించినా సర్వే సాగుతూనే ఉందనే ఆరోపణలున్నాయి.

అమృతనగర్ అక్రమాలపై సర్వే

వైసీపీ హయాంలో అమృతా నగర్‌లో ఇంటి స్థలాల్లో జరిగిన అక్రమాలపై సర్వే చేపట్టమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. తహసీల్దారు గంగయ్య రెవెన్యూ వీఆర్‌ఓ, విలేజ్ సర్వేయర్లతో కూడిన 15 బందాలు అమృతానగర్‌లో ఖాళీ స్థలాలు, పునాదులు, అసంపూర్తి ఇళ్లు, ఇళ్లలో వున్న వారి పత్రాలు, రెవెన్యూ రికారులు పరిశీలించి సర్వే చేసి విచారణ చేయమని నెల రోజుల కిందట ఉత్తర్వులు ఇచ్చారు. ఆమేరకు సర్వే టీంలు అమృతానగర్‌లో జల్లెడ పడుతూ ఇంటి స్థలాల అక్రమాలను వెలికి తీసే పనిలో వున్నారు.

వైసీపీలో సాగిన అక్రమ దందా

వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అండతో అమృతానగర్‌లో ఇంటి స్థలాల దందాను వైసీపీ నేతలు సాగించారు. నాటి ఎమ్మెల్యే రాచమల్లు సిఫార్సులతో అప్పటి రెవెన్యూ ముఖ్య అధికారి చాలా మందికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. వాటిలో ఎక్కువ బాగం రోడ్డు వెంబడి వుండే ఖాళీ స్థలాలు సామాజిక అవసరాలకు వదిలిన స్థలాలు కావడం గమనార్హం. ఇవికాకుండా కొన్ని ముఠాలు అడ్డంగా నకిలీ పట్టాలు సృష్టించి ఇంటి స్థలాలను ఆక్రమించారు. లేఅవుట్‌లో ఇచ్చిన ఇంటిపట్టాల జాబితాను కొందరు రెవెన్యూ అధికారుల నుంచే పొంది ఎవరూ తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేదో వారిని గుర్తించడం, వారికి సంబంధం లేకుండా వారిపేర నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించారు. దాదాపు వందల ఇంటి స్థలాలు ఆక్రమణల దారులు విక్రయించి కోట్ల రూపాయలు సొమ్ముచేసుకున్నారు.

నకిలీ పట్టాల ఏరివేతకు యత్నం

తాము డబ్బు పెట్టి స్థలాలు కొన్న వారు అది సరైన ఇంటి పట్టానా లేదా నకిలీ పట్టానా విచారించుకోకుండా కొనుగోలు చేసి కట్టడాలు చేసిన వారికి ఇబ్బందులు తప్పేలాలేదు. రెవెన్యూ అధికారులు ఇంటి పట్టా ఇచ్చిన వారే ఆ స్థలంలో ఇంటిని నిర్మించారా లేదా అనే నివేదిక తయారు చేస్తున్నారు. స్థలం ఆక్రమించి నిర్మించిన ఇళ్లను గుర్తిస్తున్నారు. ఖాళీ స్థలాలు ఎన్ని వున్నాయి, వాటికి పట్టాలు ఎప్పుడు ఇచ్చారు. వాటిని ఇంతకాలం ఎందుకు నిర్మించుకోలేదు. అని ఆరా తీస్తున్నారు. కొన్ని పునాదులు కట్టి వదిలేశారు. ఈ పునాదులు ఎవరు నిర్మించారు. లబ్ధిదారులున్నారా లేదా ఆక్రమణ దారులు కట్టి వుంచారా అని విచారిస్తున్నారు. మరి కొన్ని అసంపూర్తి ఇళ్లను కూడా పరిశీలిస్తున్నారు. ఇవి ఎవరి అధీనంలో వున్నాయని కూడా ఆరా తీస్తున్నారు.





ఖాళీ స్థలాలు, పునాదులను సర్వే చేస్తున్న వీఆర్‌ఓ, సర్వేయర్ల టీం - నివాసితుల ఇంటి పత్రాలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

7936 మందికి పట్టాలిచ్చిన కాంగ్రెస్

సొంత గూడు లేని పేదలకు ప్రొద్దుటూరు మండలం కొత్త పల్లె పంచాయతీలోని అమృతానగర్‌లో 2007,2008, 2009లలో మూడు దఫాలుగా అప్పటి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటి పట్టాలిచ్చింది. పాత అమృతానగర్‌లో 728 మందికి పట్టాలిచ్చింది. కొత్త అమృతానగర్‌లో మూడు ఫేజులుగా ప్రజలకు పట్టాలిచ్చింది. ఫస్ట్ ఫేజులో అర్బన్‌లో 984 మందికి, రూరల్‌లో 839 మందికి పట్టాలిచ్చింది. సెకండ్ ఫేజులో 3036 మందికి, థర్డ్ ఫేజులో 2358 మందికి మొత్తం 7936 మందికి ఇంటి పట్టాలిచ్చి ఇంటి నిర్మాణాలు సైతం చేపట్టింది. రోడ్లు కాల్వల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో తాగునీటి సదుపాయం కూడా సక్రమంగా ఏర్పాటు కాకపోవడంతో అక్కడికి ప్రజలు వెళ్ళి ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో ఆ స్థలాలు నిర్మించిన ఇళ్ళు చాలా వరకు ఖాళీగా వుండేవి. ఇంతకాలం తమ స్థలాలు ఖాళీగా వున్నా పట్టించుకోని లబ్ధిదారులు వైసీపీ ప్రభుత్వంలో కబ్జాకు గురవడంతో నాడు రెవెన్యూ అధికారులకు రోజూ ఫిర్యాదులు వచ్చేవి. కానీ నాటి రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలు సిఫార్సు చేసిన వారికి తప్ప నిరుపేద లబ్ధిదారులకు న్యాయం చేయలేదనే అపవాదులున్నాయి.

సర్వే నివేదిక సిద్ధం

నెలరోజులుగా సాగిన అమృతానగర్‌లోని ఇంటి స్థలాల అక్రమాలపై సర్వే బృందాలు సాగించి విచారణ నివేదికను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. మధ్యలో రెవెన్యూ సదస్సులు రావడంతో ఈ పక్రియ ఆలస్యం అవుతోందని అధికారులు వెల్లడిస్తున్నారు. త్వరలో నివేదికను సిద్ధం చేసి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకునే విషయమై నిర్ణయించనున్నట్లు తహసీల్దారు గంగయ్య తెలిపారు. అక్రమాలు జరిగిన వాటిపై అక్రమార్కులపై చర్యలకు సైతం ఉపక్రమిస్తామని తెలిపారు.

జగన్ నిర్ణయంతోనే విద్యుత్తు భారం

చాపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతోనే రాష్ట్ర ప్రజలపై విద్యుత్తు భారం పడిందని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. 2014-2019 వరకు టీడీపీ పాలనలో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలను ఆయన రద్దు చేసి మళ్లీ చేసుకున్న ఒప్పందాలతో ప్రజలపై భారం పడిందన్నారు. రానున్న రోజుల్లో సీఎం చంద్రబాబు విద్యుత్తు చార్జీలను తగ్గించేలా కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు చేస్తున్న ధర్నాలు, ర్యాలీలు అర్థంలేనివన్నారు.

షబానాబీకి డాక్టరేట్



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ అధ్యాపకురాలు పి.షబానాబీకి డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగన్‌రవి తెలిపారు. చెన్నైకి చెందిన వెల్‌డెక్ యూనివర్శిటీలో 'ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ సర్వేక్షన్ అండ్ ఎక్స్‌పర్టేషన్ ఆన్ డెసిసెన్ మేకింగ్ టువార్డ్స్ సెలక్షన్ ఆఫ్ ఎంప్లాయీస్ బ్రాండింగ్ విత్ రెఫరెన్స్ టు ద ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్' అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది. డాక్టరేట్ పొందిన షబానాబీని కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ప్రిన్సిపాల్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు, అభినందించారు.

సర్వే నంబర్ల ప్రకారమే పాస్‌పుస్తకాలు ఇవ్వాలి



తహసీల్దారుతో మాట్లాడుతున్న రైతులు

చాపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే వద్దని రైతులు అన్నారు. పెద్దగురవలూరు గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు రీ సర్వేతో చాలా ఇబ్బందులు ఉన్నాయన్నారు. అధికారులు వారు ఇష్టమొచ్చిన రీతిలో భూములకు ఎల్‌బీ నంబర్లు ఇచ్చారన్నారు. దీంతో భూముల విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని చెప్పారు. తాము చాలా భూమి నష్టపోతున్నామని అధికారులతో వాగ్వాదానికి దిగారు. పాత పద్ధతి ప్రకారమే సర్వే నంబర్లతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు. జాయింట్ భూములకు సబ్‌డివిజన్ చేయించుకోవాలంటే ఇతర రైతులు ఉద్దేశపూర్వకంగా అంగీకరించడంలేదన్నారు. దీంతో తాము భూములు అమ్ముకునేందుకు అవకాశం లేకుండాపోయిందన్నారు. మొత్తం 22 అర్జీలు గ్రామసభలో వచ్చినట్లు తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. ఈ సదస్సులో డీసీలు క్రిష్టారెడ్డి, నారాయణస్వామి, సర్వేయర్ లక్ష్మినారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు ఆరోగ్యం కోసం ఫిట్, ఫన్, ఫుడ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంకోసం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ఫిట్, ఫన్, ఫుడ్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవీంద్ర తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితంలో ఫిట్‌నెస్, ఆహారం ఎంత ప్రభావం చూపుతాయో నిపుణులతో ప్రజలకు వివరిస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామన్నారు. ఎఫ్-3 పేరుతో పాఠశాల చైర్మన్ జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రిగా, రెండుసార్లు ప్రధానమంత్రిగా దేశానికి మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు అమూల్యమన్నారు. ఆధార్‌కార్డు, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కు చట్టం, ఉపాధి హామీ పథకం వంటి గొప్ప పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష పాల్గొన్నారు.

చార్జీలు తగ్గించేదాకా పోరాడుతాం : వైసీపీ

విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ నిరసన ర్యాలీ



నిరసన తెలియజేస్తున్న వైసీపీ నేతలు

బద్వేలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీల ధరలు తగ్గించేదాకా పోరాడతామని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీ, ధర్నా చేపట్టారు. వైసీసీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. చైర్మన్ వాకమళ్ల రాజగో పాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పురవీధుల్లో భారీ ర్యాలీ



జమ్మలమడుగులో వైసీపీ నేతల నిరసన

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన కరెంటు చార్జీలను కూటమి ప్రభుత్వం తగ్గించే వరకూ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ కార్యాలయం నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ర్యాలీగా వచ్చారు. విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాజగోపాల్‌కు ఎమ్మెల్సీ వినతి పత్రం అందజేశారు. వైసీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, ముల్లాజానీ పాల్గొన్నారు.

ఎన్నికల హామీ వమ్ముచేశారు



డీఈకి వినతి పత్రం ఇస్తున్న రాచమల్లు

ప్రొద్దుటూరు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఆరునెలలు తిరగకముందే ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని వమ్ముచేశారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సాయిబాబా దేవళం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వైసీపీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఇన్‌చార్జ్ జడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి మున్సిపల్ వైస్ చైర్మెన్ ఖాజా, కౌన్సిలర్లు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఓటర్లపై విద్యార్థులకు అవగాహన ర్యాలీ

కొండాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓటర్లపై శుక్రవారం కొండాపురం జడ్పీహైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని, విదేశాల్లో ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి పేర్కొన్నారు. మున్సిపల్ సభా భవనంలో నిర్వహించే సమావేశంలో 24 అంశాలతో కూడిన అజెండాపై చర్చించి తీర్మానించనున్నారు. ప్రధానంగా పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీని కార్పొరేషన్ చేయాలనే అంశం కీలకంగా పెట్టారు. సమావేశానికి కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు విద్యుత్ హౌసింగ్ ఆర్‌అండ్‌బీ ట్రాఫిక్ పోలీసు శాఖవారు సైతం పాల్గొనవలసినదిగా ఆమె కోరారు.

ప్రొద్దుటూరులో ఆర్టీసీ కార్గో బుకింగ్ సౌకర్యం

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రొద్దుటూరు డిపో పరిధిలో ప్రజల సౌకర్యార్థం కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మన డిపో పరిధిలో కార్గో డెలివరి బుక్ సౌకర్యం ఉందని ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ కార్గో బుకింగ్ కిలో నుంచి 50 కిలోల వరకు బరువు ఉన్న వస్తువులు 10 కిలోమీటర్ల పరిధి వరకు డోర్ డెలివరీ చేస్తామన్నారు. మన డిపో నుంచి రాష్ట్రమంతా కార్గో సర్వీసులు ఉన్నాయని తెలిపారు. ఈ నెల రోజుల డోర్ డెలివరీ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నమని తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం

ఖాజీపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చివరి ఆయకట్టు వరకూ నీరు అందేలా కృషి చేస్తానని కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి అన్నారు. ఖాజీపేట ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి, సుంకేసుల నీటిసంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. కేసీకెనాల్ 1వ నంబరు కాల్వ ఆయకట్టు పరిధిలోని నందిపాడు నుంచి సుంకేసుల చివరి వరకు శంకరయ్య కొట్టాలు వరకు వర్షం వస్తే నీరు పోక 50 ఎకరాల దాకా రైతులు నష్టపోతున్నారన్నారు. కాల్వకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ చివరి ఆయకట్టుకు నీరు అందించేవరకు రైతులకు నీరు అందేలా చేస్తానని, మీ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు.



విశ్రాంత ఉపాధ్యాయుడు బొల్లు సిద్దయ్య మృతి



నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు

పోరుమామిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయుడు, సమాజానికి తన వంతు సేవ చేయాలని తపించిన వ్యక్తి బొల్లు సిద్దయ్య(91) శుక్రవారం మృతి చెందారు. కలసపాడు మండలం జాతివర్రిపల్లె వాసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి 40 ఏళ్లు పనిచేసి అందరి మన్ననలు పొందారు. పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.మఠం, బికోడూరు మండలాల పరిధిలో ఆయన ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆయన చేసిన సేవలకు బి.కోడూరు మండలం అమ్మవారిపేట గ్రామస్తులు ఎకరా పొలాన్ని కొని ఆయనకు బహూకరించడం విశేషం. ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు.

బలిజ సంఘం నివాళులు

బొల్లు సిద్దయ్య మృతి విషయం తెలుసుకున్న బలిజ సంఘం నేతలు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. బిమఠంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ అన్నదాన సంఘాన్ని స్థాపించడంలో కీలక పాత్రపోషించారు. బలిజ భవనం సమకూరడానికి ఆయన మూలస్తంభంగా పనిచేశారు. ఆయన మృతి పట్ల బద్వేలు, పోరుమామిళ్ల బలిజ సంఘం నేతలు కొంకుల రాంబాబు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, బలిజ సంఘం ఉపాధ్యక్షుడు పెరుగు వెంకటయ్య, డీఈ కొంకుల వెంకటరమణ, బాలచంద్ర, టీడీపీ నేతలు తిరుమలశెట్టి సుబ్బారావు, జిల్లా బలిజ సంఘం నేతలు సంతాపం ప్రకటించారు.

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కాశినాయన డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నిర్మల పేర్కొన్నారు. నర్సాపురం తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఐఈఆర్‌టీ నరేష్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్లకు పోలీసుల కౌన్సెలింగ్

ప్రొద్దుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు కౌన్సిలర్ మునీర్, మాజీ కౌన్సిలర్ జిలాన్ నడుమ ఇటీవల జరిగిన ఘర్షణల నేపథ్యంలో వారి ఇరువురు సహా వారి సోదరులు బషీర్ మహ్మద్ హుస్సేన్‌ను కడప ఎస్పీ కార్యాలయ సిబ్బంది తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... ఇటీవల కౌన్సిలర్ మునీర్‌పై మాజీ కౌన్సిలర్ జిలాన్ అతని సోదరులు మహ్మద్ హుస్సేన్ మరికొందరు గ్రీన్‌ల్యాండ్ ఏరియాలో దాడి చేసినట్లు మునీర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలావుండగా బుధవారం జిన్నారోడ్డులో నిలబడి వుండ గా మునీర్ అతని సోదరుడు బషీర్ దాడి చేశారని జిలాన్ అతని సోదరుడు మహ్మద్ హుస్సేన్ లు టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కౌన్సిలర్ మునీర్ అతని సోదరుడు బషీర్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. ఇరువర్గాల పరస్పర ఘర్షణలను నివారించడంలో భాగంగా వీరిని ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య వద్ద బైండోవర్ చేశారు. దీనితో పాటు వీరందరినీ ఎస్పీ ఆదేశాల మేరకు కడపకు తీసుకెళ్ళి పోలీసులు తమ దైన పద్ధతిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే వీరి ఘర్షణలకు ప్రధాన కారణంగా టూటౌన్ ఏరియాలో భారీగా సాగుతున్న మట్కా దందాగా కడప పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.. మట్కా నిర్వహణలో వచ్చిన లావాదేవీల్లో తేడాలే ఈ ఘర్షణలకు మూలమని వారి విచారణలో తేలిందని వెల్లడవు తోంది. కడప పోలీసులు జోక్యం చేసుకోవడం బట్టి మట్కా దందా నిర్వహిస్తున్న ఇరువర్గాలకు స్థానిక పోలీసులకు మధ్య వున్న సంబంధాలను తేటతెల్లం చేస్తోంది.